క్లుప్తంగా

ఫుట్‌పాత్‌లపై నిర్మాణాల తొలగింపు



కంచరపాలెంలో ఫుట్‌పాత్‌లపై నిర్మాణాలు తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

కంచరపాలెం: జోన్–5 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరావు ఆదేశాల మేరకు టీపీవో విజయ కుమార్ పర్యవేక్షణలో సోమవారం కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారి సబ్‌వే నుంచి ఊర్వశికూడలి వరకు ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేయడమే కాకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో సచివాలయ టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు గోవింద్, సత్తిబాబు నేతృత్వంలో సిబ్బంది నిర్మాణాలను పూర్తిగా తొలగించారు. పాదచారుల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని ఏసీపీ వెంకటరావు హెచ్చరించారు.

మూలకు చేరిన బోరుబావి



ప్రకాష్‌నగర్‌లో పనిచేయని తాగునీటి బోరు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి ప్రకాష్ నగర్‌లో నీటి ఎద్దడితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న తాగునీటి బోరు పని చేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరుబావిని వినియోగంలోకి తీసుకు రావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నాగుపాము కలకలం



నాగుపామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ నాగరాజు

సింధియా: సింధియా సమీప నేవల్ పార్కు ఏరియాలో సోమవారం ఏడు అడుగుల నాగుపాము సంచారం కలకలం సృష్టించింది. ఆ ప్రాంతంలోని ఓ షెడ్డులో దూరడంతో అక్కడి సిబ్బంది చూసి పాములు పట్టే నేర్పరి నాగరాజుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే నాగరాజు అక్కడికి చేరుకుని నాగుపామును పట్టుకుని నిర్మానుష్య ప్రదేశంలో విడిచిపెట్టాడు. తరచూ పాముల సంచారం కనిపిస్తుందని, నియంత్రణ చర్యలు చేపడతామని నేవీ అధికారులు తెలిపారు.

భౌతిక శాస్త్రం విద్యతో ఉపాధి అవకాశాలు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల అధ్యక్షతన విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ కె.హనుమంతరావుచే అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేశారు. భౌతికశాస్త్రం–పరిణామాలు అనే అంశంపై ఆయన సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చారు. భౌతికశాస్త్రం అధ్యయనం వల్ల సమాజంలో పెరిగిన సాంకేతికతను గూర్చి వివరించారు. సింగిల్ మేజర్ భౌతికశాస్త్రం చదవడం వల్ల, ఆ సబ్జెక్ట్‌లో పీజీ చేయడంతో అనేక ఉపాధి అవకాశాలున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం హనుమంతరావును సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పీఎల్ శరణ్య, అధ్యాపకులు డాక్టర్ బి. హైమావతి, డాక్టర్ ఎస్ కిరణ్మయి, కె.సత్యనాగవేణితో పాటు యూజీ, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



గోపాలపట్నం ప్రైమరీ స్కూల్



పక్కన పడేసిన పాఠశాల బోర్డు



డబ్బాలో నీటిని తాగుతున్న విద్యార్థులు

నాడు ప్రభుత్వ బడుల్లో ఎక్కువగా పేద వర్గాలకు చెందిన పిల్లలే చదువుకుంటారు. అలాంటి పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా సకల హంగులు కల్పించాలనే సంకల్పంతో నాడు–నేడు కింద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేసింది.

నేడు ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదింటి బిడ్డలు చదువుకునే సర్కారు బడులను నిర్లక్ష్యం చేస్తోంది. నాడు–నేడు అభివృద్ధి పనులను నీరు గార్చింది. నిధులు విడుదల చేయక పోవడంతో పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడవిఅక్కడే నిలిచిపోయాయి. ఫలితంగా విద్యార్థు లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బడిలో సమస్యలు పట్టవా..!

గోపాలపట్నం ప్రైమరీ స్కూల్‌లో అవస్థల నడుమ చదువులు



శ్లాబ్‌తొలగించిన గదిలో వదిలేసిన ఫర్నిచర్



కింద కూర్చొని చదువులు సాగిస్తున్న విద్యార్థులు

- అసంపూర్తిగా అభివృద్ధి పనులు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- తగ్గిన ప్రవేశాలు
- గోపాలపట్నం స్కూల్‌లో దుస్థితి

విశాఖ విద్య: ఒకటి నుంచి ఐదో తరగతి వరకు నిర్వహించే గోపాలపట్నం ప్రైమరీ పాఠశాలలో ప్రస్తుతం 80 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి పాఠాలు చెప్పేందుకు ఐదుగురు ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. వాస్తవంగా అయితే ఇక్కడ ఆరు శాంక్షన్ పోస్టులు ఉండగా, ఇటీవల ఒక ఉపాధ్యాయుడిని ఇక్కడ నుంచి వేరే స్కూల్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు. విద్యార్థులు చదువులు చెప్పేందుకు సరిపడా ఉపాధ్యాయులు ఉన్నప్పటకీ స్కూల్లో సమస్యలు పట్టిపీడిస్తున్నాయి.

పొంచి ఉన్న ప్రమాదం

ఐదు తరగతుల నిర్వహణకు ఇక్కడ సరిపడా వసతి లేని పరిస్థితి ఉంది. పై అంతస్తులో ఓ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులపై పెచ్చులూడిపడుతున్నాయని, దాని శ్లాబ్ కూల్చేశారు. నాడు–నేడు కొనసాగింపులో భాగంగా అదనపు నిధులు వస్తే ఈ గోడలను పటిష్టం చేసి కొత్తగా శ్లాబ్ వేద్దామనే ఆలోచన చేశారు. ఇప్పుడు పై అంతస్తులోకి వెళ్లే దారిలో మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. వీటి పక్క నుంచే విద్యార్థులు మరో గదిలోకి వెళ్లాల్సి ఉన్నందున, ఎప్పుడు గోడ కూలి మీద పడుతుందోననే ఆందోళనతో విద్యార్థులు బితుకు బితుకు మంటూ అటుగా వెళ్తున్నారు. ఇదే గదిలో పాత ఫర్నిచర్ పెట్టడంతో అసౌకర్యంగా ఉంది.

సమస్యలతో తగ్గిన విద్యార్థుల ప్రవేశాలు

పాఠశాలలో వసతులు లేక పోవడంతో ఆ ప్రభావం ఈ ఏడాది ప్రవేశాలపై పడింది. 2023–24 విద్యా సంవత్సరంలో 112 మంది విద్యార్థులు ఉండగా, 2024–25లో 80 మంది చదువుతున్నారు. 5వ తరగతి చదివి 42 మంది ఇక్కడ నుంచి వెళ్లగా ఈ ఏడాది ఒకటో తరగతిలో కేవలం 11 మంది మాత్రమే చేరారు. కూటమి ప్రభుత్వం స్కూళ్ల సమస్యలపై పట్టించుకునే పరిస్థితి ఉండదని భావించిన తల్లిదండ్రులు, తమ పిల్లలను వేర్వేరు పాఠశాలల్లో చేర్పించారు.

వాటర్ ప్లాంట్లు వృథా



వృథాగా ఉన్న వాటర్ ప్లాంట్లు

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఖరీదైన వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీనికి తోడు దివీస్ సంస్థ మరో వాటర్ ప్లాంట్‌ను సమకూర్చింది. విద్యుత్ పరికరాలు అమరిక, నిర్వహణకు నిధులు లేకపోవటంతో ఖరీదైన వాటర్ ప్లాంట్లు వృథాగా మారాయి. నగర పాలక సంస్థ వారు సరఫరా చేస్తున్న తాగునీటినే ఓ డబ్బాలో పట్టి అక్కడ పెడితే విద్యార్థులు తాగుతున్నారు.

నిధుల్లేక అసంపూర్తిగా పనులు

నాడు–నేడు రెండో విడుతలో పాఠశాలలో మౌలిక సౌకర్యాలు మెరుగుపరిచేందుకు రూ.22 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో అవసరమైన పనులు చేపట్టేలా పాఠశాల యాజమాన్య కమిటీ తీర్మానించింది. ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో కూటమి ప్రభుత్వం నిధులు ఆపేసింది. పాఠశాల ప్రధాన ద్వారం గేటు ఎలాగోలా అమర్చినా, దానికి రంగులు వేయకుండా అలానే వదిలేశారు. సైన్ బోర్డు లేక పోవడంతో స్కూల్ ఎక్కడ ఉందో కొత్త వారు గుర్తించ లేని పరిస్థితి. మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణ కోసం నిర్మించిన రేకుల షెడ్డు అసంపూర్తిగానే మిగిలింది.



అసంపూర్తిగా వంటశాల

బకాయిలు జమ చేయాలని ఆందోళన

మల్కాపురం: పారిశుధ్య కార్మికులకు రావాల్సిన బకాయిలు తక్షణ చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ మల్కాపురం జోన్ కమిటీ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ లోని సీఐటీయూ జెండా పాయింట్ వద్ద సోమ వారం 58,59,60వ వార్డుల పరిధి పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వాహించారు. ఆయన మాట్లాడుతూ 2018 నుంచి 2020 వరకు ప్రతి పారిశుధ్య కార్మికుడికి 2 శాతం ఇన్‌కమ్ ట్యాక్స్ కటింగ్ చేసేవారని, ఆ డబ్బులు తిరిగి కార్మికులకు ఇవ్వాలని తాము చేసిన పోరాటం మేరకు చెక్ రూపంలో బదిలీ చేశారన్నారు. అయితే ఆ నగదు ఎస్ఎల్ఎఫ్ గ్రూప్‌ల్లో జమ చేయడంతో అక్కడే ఉండి పోయిందని ఆ నగదు నేరుగా కార్మికుల వ్యక్తి గత బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నట్టు వివరించారు. కార్యక్రమానికి కార్మికులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రమణ,రాంబాబు,రాము,సూరిబాబు,కుమార్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఎంఈవో సోమేశ్వరరావు



విద్యార్థుల కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో సోమేశ్వరరావు

కంచరపాలెం: విద్యార్థుల ఉన్నత భవితకు ఉపాధ్యాయులు కృషి చేయాలని గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు పేర్కొన్నారు. జీవీఎంసీ 57వ వార్డు ఆశవానిపాలెం ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. టీచ్ టూల్ బోధనను పరిశీలించారు. విద్యార్థులతో కలిపి మధ్యాహ్నం భోజనం చేసి నాణ్యతను చూశారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు రోజూ హాజరయ్యేటట్టు ఉపాధ్యాయులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. పాఠశాల ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల హాజరు వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం రవి, ఉపాధ్యాయులు బాలకృష్ణ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వేతన వెతలు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు చేపడుతున్న ఓ సంస్థ తమకు వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదని కార్మికులు వాపోతున్నారు. సమస్యపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే పోలీసు కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క వేతనాలు రాక,మరో పక్క పోలీసుల పిలుపుతో స్టేషన్ చుట్టూ తిరగలేక నలిగిపోతున్నామని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన 20 మంది వాపోతున్నారు. కనీసం సెటిల్‌మెంట్ కూడా సక్రమంగా చేయడం లేదని.. కార్మిక చట్టాల ప్రకారం బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. హెచ్‌పీసీఎల్ యాజమాన్యం స్పందించి తమకు న్యాయం చేయాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.

కేవీలో సందడిగా శ్రేష్ట భారత్ ఉత్సవాలు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు



గీతాలాపన చేస్తున్న విద్యార్థులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ శ్రీవిజయనగర్ కేంద్రియ విద్యాలయం–2లో ఏక్‌భారత్, శ్రేష్ట భారత్ ఉత్సవాలు –2024ను సోమవారం ఘనంగా నిర్వహించారు. సీబీఎస్‌సీ పాఠశాల పర్యవేక్షకుడు సి.వి. నరసింహం, దూరదర్శన్ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ షఫీ మహ్మద్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీసి వారి శక్తి సామర్థ్యాలను పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. మూడు రోజులు జరిగే ఉత్సవాల్లో రాష్ట్రేతర స్థాయి నుంచి 8 క్లస్టర్లలో 72 పాఠశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన పోటీల్లో తమ ప్రతిభ కనబర్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ, రామ్‌భూపాల్, లక్ష్మీపాయి, రామచంద్రరావు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల సంబరాలు ప్రారంభం



రెడ్డివీధిలో గౌరీపరమేశ్వరులను ఊరేగిస్తున్న నిర్వాహకులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధి రెడ్డివీధిలో గౌరీపరమేశ్వరుల సంబరాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను నవంబర్ 20వ తేదీ వరకు నిర్వహిస్తామని స్థానిక నాయకులు రమణారెడ్డి, కాకి పోలిరెడ్డి తెలిపారు. మల్కాపురం ఆంజనేయస్వామి ఆలయం నుంచి రెడ్డివీధి వరకు గౌరీ పరమేశ్వరులను మేళతాళాలు, కోలాటాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి పీఠం వద్ద నెలకొల్పారు.

ధరల పెరుగుదలతో ప్రజలు సతమతం

మల్కాపురం: రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని సీపీఐ నగర నాయకులు కె.సత్యాంజనేయ ఆవేదన చెందారు.పెరిగిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మల్కాపురం మార్కెట్ వద్ద సీపీఐ నాయకులు నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూరగాయలు ధరలు,నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగాయన్నారు.వీరికి మద్యంపై ఉన్న శ్రద్ధ పేద ప్రజల ఆర్థిక ఇబ్బందులపై ఉండడం లేదని విమర్శించారు. మద్యం విచ్చల విడిగిగా విక్రయించి దోచుకోవాలని పాలకులు చూస్తున్నారే తప్పా,దాని వల్ల ఎంత మంది యువత చెడిపోతారో,ఎంత మంది మహిళలు ఇబ్బంది పడతారో ఆలోచించకపోవడం దారుణమన్నారు. కూటమి పాలకులు ఇప్పటికైనా స్పందించి పేద ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని,లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

చేయి చేయి కలిపారు



ప్రాంగణాన్ని పరిశుభ్రం చేస్తున్న దుకాణదారులు, రైతులు

రైతు బజార్‌లో స్వచ్ఛభారత్

విశాఖ విద్య: మర్రిపాలెం రైతు బజార్‌లో సోమవారం ఈవో కొమ్మనాపల్లి వరహాలు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దుకాణాలు నిర్వహించే డ్వాక్రా సంఘాల సభ్యులు, రైతులు, రైతు బజార్ అధికారులు, సిబ్బంది కలసి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. రైతు బజార్ వెనుక వైపు ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. రైతు బజారు ప్రాంగణం అంతా శుభ్రం చేశారు. రైతు బజార్ ఎస్టేట్ అధికారి వరహాలు మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు స్వచ్ఛత కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తున్నామన్నారు. మన రైతుబజార్–మన బాధ్యత అనే నినాదంతో చేపడుతున్న కార్యక్రమానికి అంతా సహకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు నిరాశ్రయులకు ఆశ్రయం



వసతి పొందిన వారితో ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార : రామకృష్ణా బీచ్ పరిసరాల్లో తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులకు టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ – ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో సోమవారం ఆశ్రయం కల్పించారు. వివరాలిలా వున్నాయి. ఎస్.రమేష్ (68), చంద్రమ్మ (60) అనాథలుకాగా ఎస్.భారతి (38)కి కుటుంబమున్నా ఆమె వారితో కలవడం లేదు. గతంలో ఆమెను రెండుసార్లు వసతిగృహం నుంచి ఇంటికి పంపించినా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో వీరు ముగ్గురూ ఆర్‌కే బీచ్ ఏరియాలో తిరుగుతుండగా గమనించిన వన్‌టౌన్ సీఐ ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది అక్కడ రెస్క్యూ నిర్వహించి ఆ ముగ్గురినీ ద్వారకానగర్‌లో గల నిరాశ్రయుల వసతిగృహానికి సోమవారం తరలించారు. ఇక్కడ పురుషులు, మహిళలకు వేర్వేరుగా వసతి గృహాలున్నాయి. వీరి వివరాలను ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి ఆరా తీస్తున్నారు.

16, 17న ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు



సమావేశంలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

అల్లిపురం : విశాఖ జిల్లా ఏఐఎస్ఎఫ్ 32వ మహాసభలు నవంబర్ 16, 17న నగరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి యు.నాగరాజు తెలిపారు. ఈ మేరకు అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో పి. శేఖర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహాసభల్లో జిల్లాలో గల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నూతన కార్యవర్గంతోపాటు జిల్లా సమితిని ఎన్నుకుంటామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై చర్చించి తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. జిల్లా సమితి సభ్యులు శివరాజ్‌కుమార్, శివరామరెడ్డి, సందీప్, కిరణ్, లవకుమార్, సూర్య గణేష్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ వీరబాహులో వైద్యగది ప్రారంభం



వైద్య గదిని ప్రారంభిస్తున్న కమాండ్ మెడికల్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ అజిత్ గోపీనాథ్

సింధియా: తూర్పు నావికాదళ పరిధిలోని ఐఎన్ఎస్ వీరబాహులో ఆయుప్రవిధ క్లినిక్‌లో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన వైద్యుల తనిఖీ గదిని కమాండ్ మెడికల్ ఆఫీసర్ ,రియర్ అడ్మిరల్ అజిత్ గోపీనాథ్ ప్రారంభించారు. భారత నావికాదళంలో పనిచేసే సిబ్బందికి అత్యుత్తమ వైద్య సంరక్షణను అందించాలనే లక్ష్యంగా దీన్ని ప్రారంభించినట్లు నేవీ వర్గాలు తెలిపాయి.